సాక్షి
రంగారెడ్డి

సోమవారం ■ 8 ■ మే ■ 2023



పత్తి సాగుకే మొగ్గు..!
వానాకాలంలో సీజన్‌లో పత్తి సాగుకు రైతులకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ మద్దతు బాగుండడంతో సాగుకు ఆసక్తి చూపుతున్నారు. 8లో▸



దర్శనం.. పూర్వజన్మ సుకృతం
మరకత శివలింగాన్ని దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతమని ప్రముఖ టాలీవుడ్ సినీ దర్శకుడు శ్రీను వైట్ల అన్నారు. 8లో▸



హైనాలా.. వీధికుక్కలా..?
తాడిపర్తి – కుర్మిద్ద అటవీ ప్రాంతం చుట్టూ వ్యవసాయ బావులు ఉన్న రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. 8లో▸

న్యూస్‌రీల్

‘తెలంగాణ భరోసా సభ’ సక్సెస్.. క్యాడర్‌లో జోష్

హుడాకాంప్లెక్స్: బహుజన్ సమాజ్ పార్టీ ఆదివారం సాయంత్రం సరూర్‌నగర్ స్టేడియం వేదికగా నిర్వహించిన ‘తెలంగాణ భరోసా సభ’ సక్సెస్ అయ్యింది. ఆశించిన దానికంటే అధిక సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాబోయే ప్రధాని మాయావతి అంటూ కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. జై భీమ్.. జై బీఎస్పీ, జై మాయావతి నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తింది.

‘ప్రైవేట్’ ఫీజుల దోపిడీపై ఉద్యమిస్తాం

ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మురళి

బడంగ్‌పేట్: ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల ఫీజుల దోపిడీని వెంటనే అరికట్టాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పీ మురళి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం బడంగ్‌పేట పరిధిలోని కుర్మల్‌గూడ పార్టీ కార్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమైక్య రంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జిల్లా కార్యదర్శి బీ భాను ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల ఆగడాలు మితిమీరి పోతున్నాయని ఆరోపించారు. వెంటనే కట్టడి చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పీ శ్రీకాంత్, బాలాపూర్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్ మండలాల అధ్యక్షులు పీ వరుణ్, కార్తీక్, డీ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పరమేశ్వర్ మాదిగ



మాట్లాడుతున్న పరమేశ్వర్ మాదిగ

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సీ పరమేశ్వర్ మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం రెండు దశాబ్దాలుగా మాదిగలు, మాదిగ ఉప కులాలు పోరాటం చేస్తున్నాయని తెలిపారు. అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో రెండు సార్లు తీర్మానాలు చేసి కేంద్రానికి పంపినా ఫలితం లేదన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీకి రాజకీయ సమాధి కడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సీ జంగయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పంటనష్ట పరిహారమేదీ?

రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

యాచారం: వడగళ్ల వానకు జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, పరిహారం అందజేతలో కేసీఆర్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బీ మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వడగళ్ల వానకు దెబ్బతిన్న ప్రతి ఎకరాకు రూ. 10 వేలు పరిహారం ఇస్తామన్న ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే పరిహారం ఇవ్వాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆకట్టుకుంటున్న హైలైఫ్ ఎగ్జిబిషన్

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను ఆదివారం జబర్దస్త్ ఫేం వర్ష, నటి శుభశ్రీ రాయగురు, కృతికరాయ్‌లతో పలువురు మోడల్స్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి వర్ష మాట్లాడుతూ దేశంలోని 350 మంది ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు ఇక్కడి స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. నగరవాసులను ఆకట్టుకునే విధంగా వీటిని తీర్చిదిద్దడం బావుందన్నారు. సమ్మర్ స్పెషల్ వస్త్రాలు ప్రత్యేక డిజైన్‌లతో అందుబాటులో ఉన్నాయన్నారు. నిర్వాహకుడు డొమినిక్ మాట్లాడుతూ సమ్మర్‌స్పెషల్, ఫ్యాషన్‌వేర్, ట్రెండ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.





హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం బహుజన సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘తెలంగాణ భరోసా సభ’వేదికపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతికి జ్ఞాపికను బహూకరిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్. పక్కన సభకు హాజరైన జనం. – హుడాకాంప్లెక్స్

‘పట్టా’.. అయ్యింది ఎట్టా!

నాటి నిషేధిత భూములే నేటి పట్టా భూములు

- ‘ధరణి’ రాకతో మారిన భూ స్వరూపాలు
- ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, వక్ఫ్ భూములు మాయం
- రియల్టర్ల చేతుల్లోకి రూ. కోట్ల విలువైన సర్కారు స్థలాలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: నిన్న మొన్నటి వరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములు పట్టా భూములుగా మారుతున్నాయి. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, భూదాన్ భూముల స్వరూపమే మారిపోతోంది. కొంత మంది రెవెన్యూ అధికారులు భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన ‘ధరణి’ సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డు పెట్టుకుని అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్నారు. అడిగినంత ముట్టజెబితే చాలు.. అప్పటి వరకు పట్టా భూములుగా ఉన్నవాటిని ప్రభుత్వ నిషేధిత భూములుగా ప్రభుత్వ భూములను ప్రైవేటు పట్టా భూములుగా మారుస్తూ తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు సైతం క్షేత్ర స్థాయి రిపోర్టులనే ప్రామాణికంగా తీసుకుని డిజిటల్ సైన్‌లు చేస్తున్నారు. ఫలితంగా రూ.కోట్ల విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. వీటికి ఇటు హెచ్ఎండీఏ అటు డీటీసీపీలు కూడా గుడ్డిగా ఎల్పీ నంబర్లు జారీ చేస్తుండటంతో వెంచర్లుగా మారి మార్కెట్లో విక్రయానికి వస్తున్నాయి.

సర్కారు టు ప్రైవేటు

ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌లోని సర్వే నంబర్ 618లో 33.10 ఎకరాల గైరాన్ భూమి రియల్టర్ల చేతుల్లోకి వెళ్లింది. 2017 వరకు ఈ భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. నాటి రికార్డుల్లో నిషేధిత జాబితాలో ఉన్న ఈ భూమి ప్రస్తుతం ప్రైవేటు పట్టా భూమిగా ఎలా మారిందనేదీ అంతుచిక్కడం లేదు.

అసైన్డ్ నుంచి పట్టా

కడ్తాల్ మండలం కర్కల్‌పహాడ్ గ్రామశివారులోని గోవిందాయపల్లితండా సర్వే నంబర్ 52లో ప్రభుత్వ భూమి ఉంది. 1954 ఖాస్రా పహాణీల్లోనూ బంజరు భూమిగా రికార్డై ఉంది. ఇందులో కొంత భూమిని అప్పటి ప్రభుత్వం పేద గిరిజనులకు అసైన్డ్ చేసింది. ఈ భూములపై కన్నేసిన ఓ రియల్టర్ పక్కనే పట్టా భూమిని కొనుగోలు చేసి..ఇటు పక్కన ఉన్న అసైన్డ్ భూములను తన వెంచర్‌లో కలిపేసుకున్నట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఇప్పటికే ఇక్కడి కొంత అసైన్డ్ భూమి పట్టా భూమిగా మారినట్లు తెలిసింది.

సీలింగ్ టు పట్టా

ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 44లో 13.26 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ శాఖలో సీలింగ్ సర్‌ప్లస్‌గా నమోదైంది. ఏళ్ల తరబడి నిషేధిత జాబితాలో ఉన్న ఈ భూమి ఇటీవల పట్టా భూమిగా ఎలా మారిందనేదీ అంతు చిక్కడం లేదు.

హెచ్ఎండీఏ భూమి..రిజిస్ట్రేషన్లు

శంషాబాద్ సర్వే నంబర్లలో 720 నుంచి 730 వరకు 50 ఎకరాల హెచ్ఎండీఏ భూములు ఉండగా, స్థానిక నేతలు కొంత భూమిని కబ్జా చేసి వెంచర్ వేశారు. ఒకే ఇంటి నంబర్‌తో ఐదు ప్లాట్లు విక్రయించారు. నిజానికి అక్కడ ఎలాంటి నిర్మాణాలు లేకున్నా..వాటిలో ఇళ్లు ఉన్నట్లు నిర్ధారించి ఒకే పీటీఐఎన్ నంబర్‌తో ఇతరులకు రిజిస్ట్రేషన్లు చేయడం గమనార్హం.

దర్గాగా కబ్జా

తలకొండపల్లి మండలం ఖానాపూర్ సర్వే నంబర్ 16,18,20లో 24 ఎకరాలు, సర్వే నంబర్ 145లో 10.24 ఎకరాల పోరంబోకు భూములను భూస్వాములు కబ్జా చేశారు. పట్టా భూముల పక్కనే ఈ భూములు ఉండటం వారికి కలిసి వచ్చింది. హద్దులు నిర్ణయించి భూములను కాపాడటంతో రెవెన్యూ అధికారులు విఫలమైనట్లు విమర్శలు ఉన్నాయి.

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి..

రాయదుర్గం ప్రశాంతి హిల్స్ సర్వే నంబర్ 65లో 29 గుంటల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోంది. ఖాజాగూడ సర్వే నంబర్ 27లో రూ.80 కోట్ల విలువ చేసే 27.18 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు రాయదుర్గం సర్వే నంబర్ 46లోని 84.30 ఎకరాలు ప్రభుత్వ భూములపై రియల్టర్ల కన్ను పడింది. మియాపూర్ సర్వే నంబర్ 100, 101లో 445 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములు ఉండగా, వీటిలో ఇప్పటికే మెజార్టీ భూములు పట్టా భూములుగా మారి, రియల్టర్ల చేతుల్లోకి వెళ్లాయి.

నాడు వక్ఫ్.. నేడు ప్రైవేటు పట్టా

మహేశ్వరం మండలం కొంగరకుర్దు–ఎలో సుమా రు 500 ఎకరాల వక్ఫ్‌భూమి ఉంది. 1954 నుంచి ఇప్పటి వరకు పట్టా కాలమ్‌లో సయ్యద్ షారాజ్ ఖత్తార్ హుస్సేన్‌సాబ్ దర్గా పేరుతో ఉంది. సర్వే నంబర్ 85,86,88,89 లోని 58 ఎకరాల భూమి వక్ఫ్‌భూమిగా పేర్కొంటూ 2008లో అప్పటి ప్రభుత్వం గెజిట్ కూడా జారీ చేసింది. నిన్న మొన్నటి వరకు నిషేధిత జాబితాలో ఉన్న ఈ భూములు ప్రస్తుతం పట్టా భూములుగా మారడం, వాటికి హెచ్ఎండీఏ ఎల్పీ నంబర్ జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది.



ఇబ్రహీంపట్నం సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మళ్లీ భూపోరాటాలు చేస్తాం

- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపు
- భూదాన్ భూములను అడ్డగోలుగా ఆక్రమిస్తున్నా పట్టదా?
- ఇబ్రహీంపట్నంలో ఇంటింటికి సీపీఐ ముగింపు సభ

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణలో మళ్లీ భూ పోరాటాలు చేస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. పేదలు ఉంటే భూమి మీద.. లేదంటే జైలులో ఉండేలా పోరాటాలు చేస్తామన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆదివారం జరిగిన ‘ఇంటింటికి సీపీఐ’ ముగింపు సభలో ఆయన మాట్లాడారు. భూదాన్ భూములను అడ్డగోలుగా ఆక్రమిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండిపడ్డారు. గతంలో సత్యం రామలింగరాజు భూములపై పోరాటం చేశామని, ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే మళ్లీ భూ పోరాటాలు తప్పేలా లేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్న హామీలు ఇంత వరకు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రజా పోరాటాలకు సీపీఐ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకు లౌకిక, వామపక్ష శక్తులు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. చర్మకారులు చెప్పులు తయారు చేసుకొని బతుకుతుంటే వారిపై జీఎస్టీ వేసి ఆగం చేస్తోందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ధరలు పెంచి పేదలపై భారం మోపారని దుయ్యబట్టారు. 30మంది ముఠాగా ఏర్పడి డ్రగ్స్, గంజాయిలను అఫ్గానిస్తాన్ నుంచి సముద్రమార్గం గుండా విశాఖపట్నం తీసుకొచ్చి హైదరాబాద్‌లో అమ్ముతున్నారని ఆరోపించారు. డ్రగ్స్ మాఫియాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి, కావలి నర్సింహ, ఎం యాదిరెడ్డి, శేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు నీలమ్మ, లక్ష్మణ్, శ్రీశైలం, విజయ్‌కుమార్, కృష్ణ, చంద్రకళ, జయమ్మ పాల్గొన్నారు.



సభకు హాజరైన జనం



షాద్‌నగర్‌లో సమ్మె చేస్తున్న పంచాయతీ జూనియర్ కార్యదర్శులు

పౌర సేవలపై ‘సమ్మె’ట

- ఏప్రిల్ 29నుంచి జేపీఎస్‌ల ఆందోళన బాట
- పల్లెల్లో పడకేసిన పాలన
- అస్తవ్యస్తంగా పనులు

జిల్లాలో గ్రామ పంచాయతీలు	-	558
పంచాయతీ జూనియర్ కార్యదర్శులు	-	302
అవుట్ సోర్సింగ్ కార్యదర్శులు	-	76
రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు	-	183

షాద్‌నగర్: పల్లెల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకం.. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు విజయవంతంగా అమలు కావాలంటే కార్యదర్శుల ప్రమేయం తప్పని సరి. అయితే తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జేపీఎస్‌లు ఏప్రిల్ 29నుంచి సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే.. దీంతో పల్లె పాలన ఇబ్బందిగా మారింది. పాలన కుంటుపడుతోంది. అయితే జేపీఎస్‌లను విధుల్లోకి తీసుకునేటప్పుడు మూడేళ్ల ప్రొబేషనరీ విధులు నిర్వహించాలని ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రొబేషనరీ కాలం ముగియడంతో ప్రభుత్వం మరో ఏడాది పెంచింది. ఆ కాలం ముగిసినా సర్కారు స్పందించకపోవడంతో సమ్మె బాట పట్టారు. వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు.

సమ్మెతో నెలకొన్న సమస్యలు ఇవే..

ఉదయం లేచింది మొదలు గ్రామాల్లో విద్యుత్ దీపా ల నిర్వహణ, తాగునీటి సరఫరా, చెత్త సేకరణ, హరితహారం, పారిశుధ్యం తదితర అంశాల బాధ్య తను కార్యదర్శులే చూస్తారు. వారే సమ్మె బాట పట్టడంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది.

- అభివృద్ధికి సంబంధించిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో గ్రామ పంచాయతీ పాలక సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.
- నిధుల లేమితో పారిశుధ్య నిర్వహణపై పాలక వర్గం అంతగా ఆసక్తి చూపడం లేదు.
- హరితహారంలో భాగంగా ప్రభుత్వం ప్రతి గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసింది. వాటిలో మొక్కల పెంపకం, నిర్వహణపై పర్యవేక్షణ కరువైంది. ఉపాధి పనులపై కూడా పర్యవేక్షణ లేకుంటే పోయింది.
- పంచాయతీలకు ఆదాయ వనరు పన్నులే. జేపీఎస్‌ల సమ్మె కారణంగా ఇంటి పన్నులు, నల్లా పన్నుల వసూళ్లలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- పింఛన్ల పంపిణీలో పంచాయతీ కార్యదర్శుల ప్రమేయం ఉంటుంది. ఇంటి నుంచి బయటికి రాలేని వారికి, అలాగే నడవలేని వారికి పంచాయతీ కార్యదర్శుల వేలి ముద్రల ద్వారా పంపిణీ చేయాల్సి ఉంటుంది. సమ్మె కారణంగా వారికి పింఛన్లు అందడం కష్టంగా మారింది.

అభివాదం చేస్తూ.. సమస్యలు ఆలకిస్తూ..

- జిల్లాలో రెండో రోజు సాగిన భట్టి ‘పీపుల్స్ మార్చ్’ యాత్ర
- అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి వనస్థలిపురం వరకు..

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క జిల్లాలో చేపట్టిన ‘పీపుల్స్ మార్చ్’ పాదయాత్ర రెండో రోజు ఆదివారం కూడా సాగింది. శనివారం రాత్రి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడం వద్ద జిల్లాలోకి ప్రవేశించిన ఈ యాత్ర ఆదివారం ఉదయం 10 గంటలకు గుంతపల్లి నుంచి బయలుదేరి లష్కర్‌గూడ, అబ్దుల్లాపూర్‌మెట్, రామోజీ ఫిలింసిటీ, ఓఆర్‌ఆర్ మీదుగా పెద్ద అంబర్‌పేటకు చేరుకుంది. మధ్యాహ్నం అక్కడే భోజనం చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు మళ్లీ పాదయాత్రగా బయలుదేరి.. సాయంత్రం హయత్‌నగర్ మీదుగా వనస్థలిపురం చేరుకున్నారు. జిల్లాలో పదిహేను కిలోమీటర్లకు పైగా కొనసాగిన పాదయాత్రలో స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేస్తూ, కార్నర్ మీటింగ్‌ల్లో వారి సమస్యలను ఆలకిస్తూ ముందుకు కదిలారు.

గోడు వెళ్లబోసుకున్న భూ బాధితులు

బండరావిరాల గ్రామ సర్వే నంబర్ 268లోని 209 మంది రైతుల నుంచి మైనింగ్ కోసం భూములు సేకరించి, ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదని ఆ గ్రామ నేతలు భట్టి దృష్టికి తీసుకెళ్లారు. పరిహారం కోసం ఎదురు చూస్తున్నామని బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. మండలంలో 3,700 మంది దళితులు ఉంటే 17 మందికి మాత్రమే దళిత బంధు ఇచ్చారని తెలిపారు. 2020లో కురిసిన అకాల వర్షాలకు 1,500పైగా ఎకరాల్లో పంట నష్టం జరిగితే ఇప్పటికీ పరిహారం చెల్లించలేదని పలువురు బాధితులు భట్టికి తెలియజేశారు. పరిశ్రమల పేరుతో కేసీఆర్ సర్కారు లాక్కున్న భూములను తాము అధికారంలోకి రాగానే పేదలకు తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పీసీసీ కార్యదర్శి దండెం రామిరెడ్డి, జెడ్పీటీసీ దాసుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్, ఎంపీపీ బీ రేఖ, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



మహిళలతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

హైనాలా.. వీధికుక్కలా..?

- వారం రోజుల వ్యవధిలోనే 10కి పైగా దూడల మృతి
- ఏడాదిలో 500కి పైగా మృత్యువాత
- సరిహద్దు అటవీ ప్రాంతాల వద్ద ఘటనలు
- భయాందోళనలో కాపరులు


నస్దిక్‌సింగారం గ్రామంలో మృతి చెందిన దూడను చూపుతున్న రైతు

యాచారం: తాడిపర్తి – కుర్మిద్ద అటవీ ప్రాంతం చుట్టూ వ్యవసాయ బావులు ఉన్న రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. రాత్రి పూట పొలాల వద్ద కట్టేసిన పశువులు, గొర్రెలు, మేకల మందలపై దాడులు చేసి చంపేస్తున్నాయి. దాడి చేస్తోంది హైనాలా లేక వీధికుక్కలా అనేది రైతులకు అంతుపట్టడం లేదు. తాడిపర్తి – కుర్మిద్ద అటవీ ప్రాంతం దాదాపు 15 వేల ఎకరాలకు పైగా విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతం యాచారం, మాడ్గుల్, ఆమన్‌గల్, కడ్తాల్, కందుకూర్ మండలాల సరిహద్దులో ఉంది. అటవీ ప్రాంతం పక్కనే ఆయా మండలాల్లోని గ్రామాల రైతుల వ్యవసాయ బావులు ఉన్నాయి. రైతులు పొలాల వద్ద తమ పాడి, పశువులు, గొర్రెలు, మేకలను కట్టేసి రాత్రి పూట ఇంటికెళుతుంటారు. ఉదయం వచ్చి మేతకు వదులుతారు. ఇలా అటవీ ప్రాంతం అంచునే ఆయా మండలాలకు చెందిన 1,500 మందికి పైగా వ్యవసాయ బావులు ఉన్నాయి. మందల్లో, దొడ్లల్లో లక్షకు పైగానే పాడి పశువులు, మేకలు, గొర్రెలను ఉంచుతారు. ఇటీవల ఆ మందలపై అడవి జంతువులు దాడి చేసి చంపేస్తున్నాయి.

హైనాలు.. వీధి కుక్కలా?

15వేల ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న ఈ అటవీ ప్రాంతం అంచునే ఉన్న మూగ జీవాల మందలపై నిత్యం ఏదో ఒక చోట దాడులు చేసి చంపేస్తున్నాయి. ఏడాదిలో ఆయా మండలాల్లో 50కి పైగా దాడులు జరిగి 500కు పైగానే గొర్రెలు, మేకలు, పాడి, పశువులు, దూడలు మృతి చెందాయి. తాజాగా వారం రోజుల వ్యవధిలోనే యాచారం మండలం నస్దిక్‌సింగారం, కుర్మిద్ద, తాడిపర్తి, నక్కర్తమేడిపల్లి, కడ్తాల్ మండలం పల్లెచల్క తండా, సరికొండ గ్రామాల్లో పదికి పైగా దూడలు మృతి చెందాయి. దాడులతో రైతులు కూడా రాత్రి పూట పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయాందోళన చెందుతున్నారు. ఇన్ని సంఘటనలు జరిగినా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

నాడు చిరుత పులుల భయం

తాడిపర్తి – కుర్మిద్ద అటవీ ప్రాంతంలో నాడు చిరుతలు సంచరించేవి. అవి జీవాలపై దాడి చేసి చంపేవి. అటవీ ప్రాంతంలో ఆహారం దొరక్క అవి పొలాల్లోని జీవాలపై దాడులు చేసి చంపేస్తున్నట్లు గుర్తించిన అటవీ శాఖ అధికారులు అటవీ ప్రాంతంలో వందకు పైగా జింకలను వదిలారు. నాటి నుంచి చిరుతల సంచారం తగ్గుముఖం పట్టింది. చిరుతలు తాడిపర్తి – కుర్మిద్ద అటవీ ప్రాంతం నుంచి అచ్చంపేట రిజర్వ్ ఫారెస్టులోకి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. దీంతో చిరుతల భయం తగ్గింది. తాజాగా మళ్లీ జీవాలపై దాడులు జరుగుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పొలాల వద్ద దాడులు



కుర్మిద్ద గ్రామ సమీపంలో పొలం ఉంది. రెండు రోజుల క్రితం పొలం వద్ద దూడను కట్టేసి ఇంటికి వెళ్లా. ఉదయం వచ్చే సరికి దానిపై ఏదో జంతువు దాడి చేసి చంపేసింది. దాడి చేసింది హైనాలా.. వీధి కుక్కలా అనేది తెలియడం లేదు. కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి.

– బాలయ్య, రైతు, కుర్మిద్ద

పరిహారం లేదు



గత ఏడాది తాడిపర్తి – కుర్మిద్ద గ్రామాల సరిహద్దులో ఉన్న పొలాల వద్ద కట్టేసిన 150కి పైగా పశువులు, గొర్రెలు, మేకలు ఇతర జంతువుల దాడిలో చనిపోయాయి. అటవీ శాఖ అధికారులు వచ్చి వివరాలు సేకరిస్తున్నారే తప్ప పరిహారం ఇవ్వడం లేదు.

– రమేష్, సర్పంచ్, దాడిపర్తి

సమాజంలో విద్యారంగం కీలకం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శారదామంలో నిర్వహిస్తున్న శిశు మందిర నూతన ఆచార్యుల ప్రశిక్షణ వర్గంలో విద్యా భారతీ దక్షిణ క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో విద్యారంగం కీలకమైందని విద్యతో పాటు సమాజ విలువలు, దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు లభించే విధంగా భవిష్యత్తు తరాన్ని నిర్మాణం చేయాలన్నారు.

- జీవన నైపుణ్యాలు, బోధనలో సృజనాత్మకత, జాతీయతా విలువలు, ఇతరుల కష్టసుఖాల్లో భాగస్వామ్యం ఇలాంటి విషయాలను విద్యార్థులకు అలవాటు చేయాలన్నారు.
- శిశు మందిరాలలో బోధన చేసే ఆచార్యులకు బోధనతో పాటు సమగ్ర రీతిలో శిక్షణ ఇస్తూ.. వాటిని అభ్యాసం చేయడం జరుగుతుందన్నారు. విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమురి శ్రీనివాసరావు, ఆచార్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యాభారతి దక్షిణ క్షేత్ర సంఘటనా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

సంపులో పడి వృద్ధురాలు మృతి


లక్ష్మమ్మ (ఫైల్)

చేవెళ్ల: నీటి సంపులో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని ఊరెళ్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెంది మంగలి లక్ష్మమ్మ(62) తన కొడుకు రాములు వద్ద ఉంటుంది. రాములు భార్య బంధువుల వివాహానికి వెళ్లింది. మధ్యాహ్న భోజనం తీసుకువచ్చేందుకు రాములు హోటల్‌కు వెళ్లాడు. ఇంటికి వచ్చేవరకు సంపు తెరిచి ఉంది. ఆయన సంపును మూసేస్తుండగా తల్లి సంపులో పడిఉంది. దీంతో ఆయన కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలిని పరిశీలించిన ఎస్‌ఐ హయ్యూబ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

హెచ్‌ఆర్ వేధింపులు తట్టుకోలేక..

- కార్మికుడి బలవన్మరణం
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు


సురేశ్ మృతదేహం

కొత్తూరు: ఓ పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ వేధింపులు తట్టుకోలేక కార్మికుడు సూసైడ్ నోట్ రాసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన ప్రకారం.. స్టేషన్ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పాశం సురేశ్(29) గ్రామ సమీపంలోని వావిన్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. కాగా హెచ్‌ఆర్ రవికుమార్ వేధింపులు తట్టుకోలేక సురేశ్ రెండు నెలల క్రితం ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఆదివారం కుటుంబ సభ్యులు బంధువుల వివాహానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సురేశ్ ఇంటి పైకప్పుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. హెచ్‌ఆర్ వేధింపుల వల్లే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి అనసూయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివలింగ దర్శనం.. పూర్వజన్మ సుకృతం

టాలీవుడ్ దర్శకుడు శ్రీను వైట్ల


శ్రీను వైట్లను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మరకత శివలింగాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని ప్రముఖ టాలీవుడ్ సినీ దర్శకుడు శ్రీను వైట్ల అన్నారు. ఆదివారం మండలంలోని చందిప్ప గ్రామంలోని 11వ శతాబ్దం నాటి మరకత శివలింగానికి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శివలింగం చిత్రపటం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సదానందం గౌడ్, సభ్యులు దయాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో..

- మేకలు మృతి
- సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన


మృతి చెందిన మేకలను చూపుతున్న బాధితులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం లచ్చంపేట గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో రెండు మేకలు మృత్యువాత పడ్డాయి. దీంతో బాధితులు తుమ్మలపల్లి శివారులోని సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. నాలుగు రోజుల క్రితం లచ్చంపేట శివారులోని బోయ భీమయ్య పొలంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. సంబంధిత అధికారులు నేటికీ వాటిని సరిచేయలేదు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన గోరుపల్లి కుమార్‌కు చెందిన మేకలు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు వైర్లు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. విషయం తెలుసుకున్న స్థానికులు సబ్‌స్టేషన్ ఎదుట మేకల కళేబరాలతో ఆందోళన చేపట్టారు. బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

భూ వివాదంలో ముగ్గురిపై కేసు

నందిగామ: భూ వివాదంలో ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన ప్రకారం.. వీర్లపల్లికి చెందిన కాసులాబాద్ శంకరయ్య, బండగోనిగూడకు చెందిన బుచ్చయ్య, మేకగూడకు చెందిన సాంబయ్యల నుంచి నర్సప్పగూడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ చేగూరు శివారు సర్వే నంబరు 78లో 3.19 ఎకరాల భూమిని గతేడాది ఫిబ్రవరి 10న కొనుగోలు చేశాడు. ఇందుకు రూ.1.50కోట్లు ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నాడు. వ్యక్తిగత కారణాలతో గడువులోగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రిజిస్ట్రేషన్ చేయాలని పట్టాదారులను కోరాడు. ఇందుకు వారు నిరాకరించి బెదిరింపులకు పాల్పడి ఒప్పందం రద్దు చేసుకున్నట్లుగా సంతకం చేయించుకున్నారు. తీసుకున్న అడ్వాన్సు ఇవ్వకుండా, భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు.

ఇదే విషయమై కాసులబాద్ శంకరయ్య(వీర్లపల్లి శంకర్) ను వివరణ కోరగా భూమిని సకాలంలో రిజిస్ట్రేషన్ చేసుకోలేదని.. పలుమార్లు గడువు పొడిగించామన్నారు. డబ్బులు సర్దుబాటు కావట్లేదని చెప్పి శ్రీనివాస్ ఒప్పంద పత్రాన్ని రద్దు చేసుకున్నాడన్నారు. తాను తప్పు చేయనని.. మేం రాసుకున్న పేపర్లు చూపుతానన్నారు. కోర్టులో చూసుకుంటామని చెప్పారు.

పత్తి సాగుకే మొగ్గు..!



- బహిరంగ మార్కెట్లో మంచి డిమాండ్
- 60 వేల ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయాధికారుల అంచనా

షాబాద్: వానాకాలంలో సీజన్‌లో పత్తి సాగుకు రైతులకు అధికంగా మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6,080 ఉండడంతో పాటు బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి రూ.9,500 పలుకుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. గతేడాది వానాకాంలో జిల్లాలో 45,894 ఎకరాల్లో రైతులు పత్తిసాగు చేశారు. ఈసారి సుమారు 60 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

మార్కెట్‌కు చేరిన విత్తనాలు

పత్తి దిగుబడి తగ్గినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడంతో రైతులు లాభాలు గడించారు. జూన్‌లో సాగు ప్రారంభిస్తే అక్టోబర్‌లో పంట చేతికందుతుంది. పంట చేతికందిన ఆరంభంలో క్వింటాల్ పత్తి ధర రూ.9,500 పలికింది. అప్పటికే రైతులు 80శాతం పంట విక్రయించారు. కొంతమంది ధర పెరుగుతుందనే ఆశతో ఇళ్లలోనే నిల్వ ఉంచుకున్నారు. ప్రస్తుతం ధర రూ.7,500కు పడిపోవడంతో చేసేదేమీ లేక అమ్ముకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు అదనంగా రూ.3,420 ఎక్కువగా పలకడంతో పత్తి సాగుకు డిమాండ్ ఏర్పడుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతీ సంవత్సరం వానాకాలం సీజన్‌లో జూన్ చివరి వారం లేదా జూలై మొదటి వారంలో పత్తి సాగు చేస్తారు. మరో 20 రోజుల్లో సీజన్ ప్రారంభం అవుతుండడంతో ఇప్పటికే పత్తి విత్తనాలు మార్కెట్‌కు చేరుకున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయించే అవకాశాలున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు

రాజేంద్రనగర్: విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కన్వీనింగ్ కమిటీ సభ్యురాలు పార్వతి అన్నారు. మేడే వారోత్సవాలను పురస్కరించుకుని 7వ రోజు కాటేదాన్‌లో ఆటాపాటా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల పిల్లలు, విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. గెలుపొందిన వారికి సోమ వారం కాటేదాన్‌లో జరిగే బహిరంగ సభలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

‘యువ సంఘర్షణ’ సభను విజయవంతం చేయాలి

శంషాబాద్: యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ అన్నారు. సోమవారం నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో ప్రియాంకాగాంధీ పాల్గొనే ‘యువ సంఘర్షణ’ సభకు పార్టీ శ్రేణులు, నేతలు, కార్యకర్తలతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

అల్లం, వెల్లుల్లి పేస్ట్ నుంచి కూల్ డ్రింక్స్ దాకా..


స్వాధీనం చేసుకున్న అల్లం,వెల్లుల్లి పేస్ట్

- రసాయనాలతో అల్లం వెల్లుల్లి పేస్ట్, శీతల పానీయాల తయారీ
- పరిశ్రమపై ఎస్ఓటీ దాడులు
- ఇద్దరు నిర్వాహకుల అరెస్ట్


పరిశ్రమలో భారీ యంత్రాలు

రాజేంద్రనగర్: అనుమతులు లేకుండా పరిశ్రమను నిర్వహించడమేగాక రసాయనాలతో అల్లం వెల్లుల్లి పేస్ట్, శీతల పానీయాలు(కూల్‌డ్రింక్స్) తయారు చేస్తున్న కర్మాగారంపై ఆదివారం రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 500 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్, మ్యాంగో డ్రింక్, 210 లీటర్ల అసిటిక్ యాసిడ్, 550 కిలోల మసాలా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఇద్దరు నిర్వాహకులను అరెస్టు చేసి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాటేదాన్ శాంతినగర్‌లో ఫిరోజ్, అజిత్ రెండేళ్లగా అనుమతులు లేకుండా ఉమ్మాని ఫుడ్ కంపెనీ పేరుతో పరిశ్రమను నిర్వహిస్తున్నారు. సదరు పరిశ్రమలో అల్లం, వెల్లుల్లి పేస్ట్‌తో పాటు మ్యాంగో, ఆరెంజ్ జ్యూస్‌తో పాటు ఫుడ్ మసాలాలను తయారు చేసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీకి ప్రమాదకరమైన రసాయనాలను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అల్లం, వెల్లుల్లి పేస్ట్‌లో వెల్లుల్లి పొట్టును మాత్రమే వినియోగిస్తుండటం గమనార్హం. అల్లం వెల్లుల్లి పేస్ట్‌లో రెండేళ్లుగా అల్లమే వాడకుండా తయారు చేస్తున్నారు. ఎస్ఓటీ పోలీసులు దాడి చేసిన సమయంలో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న పదార్థాలే కనిపించాయి. శీతల పానీయాలను తయారు చేసేందుకు మురుగునీటిని వాడుతున్నారని, ఫ్లేవర్ల కోసం రసాయనాలను వినియోగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించా రు. రెండేళ్లుగా నిందితులు ఎలాంటి అనుమానం రాకుండా పరిశ్రమను నిర్వహించడం గమనార్హం. భారీ యంత్రాలతో పెద్ద ఎత్తున ఉత్పత్తులు చేస్తున్న వీరు రాష్ట్రవ్యాప్తంగా వాటిని సరఫ రా చేసినట్లు వెల్లడైంది. నిందితులను అదుపులోకి తీసుకుని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న ఫుడ్ మసాలాలు

అధునాతన యంత్రాల వినియోగం...

అల్లం, వెల్లుల్లి పేస్ట్‌తో పాటు గరంమసాలాలు, శీతల పానీయాల మిక్సింగ్, ప్యాక్ చేసేందుకు నిందితులు అధునాతన యంత్రాలను ఏర్పాటు చేశారు. పదుల సంఖ్యలో ఉన్న ఈ యంత్రాల ద్వారా ప్రతి రోజు రూ. లక్షల విలువైన మసాలాలు, అల్లం పేస్ట్, శీతల పానీయాలను తయారు చేస్తున్నారు. ఈ ఘటనపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశామని, స్వాధీనం చేసుకున్న పదార్థాలను ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు.